**ఇంజనీర్ పాండురంగం కొంచెం నిజాయితీపరుడని ఈమధ్యనే ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. జిల్లా పరిషత్‌లోని నీటిపారుదల శాఖలో ఆయన తీవ్రంగా ఫైళ్ళన్నీ తిరగేస్తున్నాడు.**

ఎదురుగా టేబుల్‌పై దేవరపల్లి గ్రామస్తులు పెట్టుకొన్న 'పిటిషన్' దీనంగా రెపరెప లాడుతోంది. ఆ పిటిషన్‌లో ఆ గ్రామస్తులు ఇలా మొర పెట్టుకున్నారు :




"మా గ్రామంలో చెరువు త్రవ్వడానికి ప్రభుత్వం ఐదేళ్ళక్రింద పదివేల రూపాయలను మంజూరు చేసింది. ఇంతవరకు చెరువు త్రవ్వలేదు. వెంటనే ఆ చెరువు పని పూర్తిచేయవలసిందని మనవి."

ఇంజనీర్ పాండురంగంకు దేవరపల్లి చెరువు త్రవ్వకం ఫైలు చివరికి దొరికింది. చెరువు త్రవ్వకానికి సంబంధించిన ఎస్టిమేటు, త్రవ్వినందుకు జరిగిన ఖర్చు, చెరువు చివరికి గ్రామస్తుల వాడకానికి సిద్ధమైపోయిందని కాగితాలు ఫైలులో శుభ్రంగా సాక్ష్యంగా వున్నాయి.

చెరువు ఈనాటికీ త్రవ్వలేదని గ్రామస్తుల పిటిషన్. ప్రక్కనే పదివేలు ఖర్చు చేసి చెరువు పూర్తిచేశారన్న కాగితాల కట్ట.

పాండురంగం ఆ ఫైలు పుచ్చుకొని జీపులో దేవరపల్లికి బయలుదేరాడు. ఎక్కడా చెరువు ఆచూకీ లేదు. గ్రామం చుట్టు తిరిగాడు. జీపు వెనకాల రేగుతున్న దుమ్ము—ధూళి మొలలతో పరిగెత్తుకొస్తున్న పిల్లలు వెనకాలే మిగిలిపోయారు.

ఆదిలాబాద్ టవున్‌లో నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఇంజనీరు పాండురంగం చాలా సీరియస్‌గా మరో కొత్త ఫైలుకు ఊపిరిపోశాడు. ఆయన పై అధికారులకు ఇలా వ్రాశాడు: "దేవరపల్లి గ్రామంలో పదివేల ఖర్చుతో చెరువు త్రవ్వకం జరిగింది. కానీ ఆ చెరువులో నీరు నిలిచిపోయి దోమలను పెంచుతున్నది. గ్రామస్తుల ఆరోగ్యం కాపాడాలంటే, ఆ చెరువును పూడ్చవలసిన అవసరం వుంది. మా ఎస్టిమేషన్ ప్రకారం ఆ చెరువును పూడ్చటానికి ఐదువేల రూపాయలు అవసరం. వెంటనే ఐదువేల రూపాయలను మంజూరు చేయవలసిందని మనవి."

కొంతకాలం కాగానే ఇంజనీర్ పాండురంగం చేతుల్లోకి చెరువు పూడ్చే పని నిమిత్తం ఐదువేల రూపాయలు సజావుగా చేరుకున్నాయి. ఆయన తెరిచిన కొత్త ఫైలు ఐదువేలు మింగి ఆఫీసు అలమారాలో శాశ్వతంగా నిదురపోయింది.

దేవరపల్లి గ్రామస్తులు మా చెరువు సంగతి ఏమిటంటూ పై అధికారులకు మరో పిటిషన్ పెట్టుకున్నారు. ఇంజనీర్ పాండురంగం మరికొంచెం నిజాయితీ పరుడని మరొక జిల్లాకు ప్రమోషన్‌పై వెళ్ళిపోయాడు.

---




"ప్రొద్దుటికి రావాల్సిన సుబ్బారావు పదకొండు అయినా ఇంకా రాలేదేవిటి చెప్మా!" అనుకుంటూ ఏ క్షణాన్నైనా 'బజ్జర్' శబ్దం అవుతుందేమోనని ఈజీ చైర్‌లో పడుకుని సీలింగ్ ఫాన్‌వైపు చూస్తున్నాను.

"బహుశా బస్సు రావడం ఆలస్యమైందేమో? రాజమండ్రిలో ఉదయం 8-20కి బయల్దేరిన నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సు, పావుతక్కువ పది ప్రాంతాల్లో కాకినాడ వచ్చేస్తుంది. పోనీ ఏ పదో - పదిహేనో నిముషాలు ఆలస్యమైనా, బస్సుస్టాండులో దిగి, రిక్షాలో 'జగన్నాయకపురం' చేరటానికి ఇరవై నిముషాలుచాలు. అలా చూసుకున్నా, పదిన్నరకైనా వచ్చేయాల్సింది సుబ్బారావు. ఒకవేళ ప్రోగ్రాంకానీ కాన్సిల్ చేసుకున్నాడా? అదేంలేదే. నిన్న ఉదయమేగా రాజమండ్రి నుంచి STD చేసి మరీ చెప్పాడు...."బస్సు స్టాపుక్కూడా రావద్దు.... నేనే వచ్చేస్తాను బస్సుదిగి.... నువ్వు ఇంట్లోనే కూర్చుని నా కోసం చూస్తూ వుండు, అంతేచాలు." అన్నాడు.

చేతినున్న "ఎలక్ట్రానిక్ డిజిటల్ వాచ్" టైము పదకొండున్నర చూపెడుతోంది.

కొంపదీసి, బస్సుక్కానీ 'యాక్సిడెంట్' కాలేదుగదా? ఏమో. ఏం చెప్పగలం? ఈ రోజుల్లో మనుషులు చేసే పాపాల్తో పాటు ప్రమాదాలు పెచ్చు పెరిగి పోతున్నాయి. ఆలోచించినకొద్దీ తలనొప్పి, లేనిపోని అనుమానాలు. అలాగని ఆలోచించకుండా వూరుకోలేను.

అయినా, సుబ్బారావు చాలా మంచివాడు. అట్లాంటివాడికి ఎట్లాంటి ప్రమాదం జరుగదు. అలాగయితే ప్రమాదాల్లో చిక్కుకున్న వాళ్ళంతా చెడ్డవాళ్ళనా? అలా కాకపోయినా, సుబ్బారావు మంచివాడు కనుక, యింత త్వరగా, అకస్మాత్తుగా చచ్చిపోవటానికి వీల్లేదు. ఇదెక్కడి

